## క్లుప్తంగా

### జీపీ రికార్డుల తనిఖీ



నస్రుల్లాబాద్ : మండలంలోని మిర్జాపూర్ పంచాయతీ కార్యాలయాన్ని ఎంపీడీవో రాము సోమవారం తనిఖీ చేశారు. కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో పారిశుధ్య పనులు సక్రమంగా చేపట్టాలన్నారు. బతుకమ్మ పండుగ నేపథ్యంలో చెరువులు, కాలువల వద్ద శుభ్రం చేయించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శి రవి ఉన్నారు.

### కొత్త రైతులకు పంట రుణాలు



నిజాంసాగర్ : అచ్చంపేట సొసైటీ పరిధిలోని రైతులకు కొత్తగా పంట రుణాలు ఇస్తున్నామని సొసైటీ చైర్మన్ నర్సింహారెడ్డి అన్నారు. సోమవారం సొసైటీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. సంఘం పరిధిలోని 380 మంది రైతులకు రూ.1.33 కోట్లు రుణమాఫీ వచ్చిందన్నారు. ధాన్యం కొనుగోళ్లకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. సొసైటీ సీఈవో సంగమేశ్వర్ గౌడ్ ఉన్నారు.

### అందుబాటులో శనగ విత్తనాలు

సదాశివనగర్ : మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయంలో శనగ విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు చైర్మన్ కమలాకర్ రావు తెలిపారు. విత్తనాలు కావల్సిన రైతులు పట్టాపాస్ పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్‌లతో విండో కార్యాలయంలో సంప్రదించాలన్నారు. 25 కిలోల విత్తనాల బస్తాకు రూ.1,875 ఉందన్నారు.

### కళాశాలలో స్వచ్ఛభారత్



తాడ్వాయి : తాడ్వాయి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కాలేజీ ఆవరణలో ఉన్న చెత్తాచెదారం, పిచ్చి మొక్కలు తొలగించారు. ప్రిన్సిపాల్ సయ్యద్ యూసుఫ్ హుస్సేన్, ప్రోగ్రాం ఆఫీసర్ సంగన్న పాల్గొన్నారు.

### సాదాసీదాగా మండల సభ



నిజాంసాగర్ : ఎన్నికల కోడ్ నేపథ్యంలో నిజాంసాగర్ మండల పరిషత్ సర్వ సభ్య సమావేశాన్ని సోమవారం సాదాసీదాగా నిర్వహించారు. ఎంపీపీ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచులు, ఆయా శాఖల అధికారులు హాజరయ్యారు. ఐసీడీఎస్, ఆరోగ్య శాఖల నివేదికలను ఆయా శాఖల అధికారులు చదివి వినిపించగానే సమావేశాన్ని ముగిస్తున్నట్లు వైస్ ఎంపీపీ మనోహర్ ప్రకటించారు. మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు గైని విఠల్, అచ్చంపేట సొసైటీ చైర్మన్ నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### క్రీడాకారులను అభినందించిన డీఈవో



కామారెడ్డి టౌన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో 67వ రాష్ట్ర స్థాయి క్రీడల్లో అండర్-17లో రాష్ట్ర స్థాయిలో మొదటి బహుమతి పొందిన జిల్లా క్రీడాకారులను డీఈవో రాజు సోమవారం అభినందించారు. డీఈవో కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జ్ఞాపికలు, శాలువాలతో సత్కరించారు. ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి రసూల్, రగ్బీ క్రీడా అసోసియేషన్ అధ్యక్షుడు పున్నరాజేష్, నీలం రవి, భానుప్రసాద్ తదితరులున్నారు.

### మొరం తవ్వకాలపై ఫిర్యాదు



భిక్కనూరు : భిక్కనూరు సమీపంలోని పోతుల గుట్టవద్ద మొరం తవ్వకాలపై బీఎస్పీ నేతలు సోమవారం తహసీల్దార్ శివప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ మొరం తవ్వకాలపై ఆర్డీవోకు, మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేయగా పోలీసులు వచ్చి జేసీబీతో పాటు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారని చెప్పారు. అధికారులు కేసులు నమోదు చేయాలని లేకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ద్యాగల రాజు, ద్యాగల నవీన్, గోసు రాము, గోసు సతీషు, పెర్మల ప్రసాద్, సందీప్, తరుణ్ పాల్గొన్నారు.

# పూజలందుకుంటున్న అమ్మవారు

జిల్లాలో దేవి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. సోమవారం మండపాల్లో కొలువుదీరిన దుర్గామాతకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పలు మండపాల వద్ద మహిళలు కుంకుమార్చనలు చేశారు. రెండో రోజు అమ్మవారు గాయత్రి దేవి రూపంలో దర్శనమిచ్చారు.

– సాక్షి, నెట్‌వర్క్



కామారెడ్డి శ్రీశారదా మాత ఆలయంలో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు



నస్రుల్లాబాద్‌లో కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు



బోర్లంలో..



ఎల్లారెడ్డి వైశ్యభవన్‌లో..



రాజంపేటలో..



నర్వలో హోమం నిర్వహిస్తున్న భక్తులు



దోమకొండలోని చాముండేశ్వరి ఆలయంలో..



మర్కల్‌లో పూజలు చేస్తున్న భక్తులు



కామారెడ్డి కాకతీయనగర్‌లో..



భిక్కనూరులో..

# ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి



వినతి పత్రం అందిస్తున్న ఆటో జేఏసీ నాయకులు

కామారెడ్డి అర్బన్ : జిల్లాలోని దాదాపు 15వేల మంది ఆటో డ్రైవర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆటో యూనియన్ ఐక్య కార్యాచరణ కమిటీ డిమాండ్ చేసింది. ఆటో యూనియన్ జేఏసీ నాయకులు సోమవారం కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో కలెక్టరేట్ అధికారికి వినతి పత్రం అందజేశారు. కామారెడ్డిలో కనీసం 6 ఎకరాల్లో ఆటో నగర్ ఏర్పాటు చేయాలని, కార్మికుల లేబర్ కార్డులు అందించడంతో పాటు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి 60 శాతం సబ్సిడీపై ఆటోడ్రైవర్లకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆటో జేఏసీ జిల్లా అధ్యక్షుడు బోదాసు నర్సింలు, కృష్ణ, రాజిరెడ్డి, ఇటుక నర్సింలు, గోల్కొండ రాజయ్య, జంగం స్వామి, రవి, సయిద్ పాల్గొన్నారు.

# పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన



ఎస్సైకి వినతిపత్రం అందజేస్తున్న ప్రతినిధులు

దోమకొండ : దోమకొండ పోలీస్‌స్టేషన్ ఎదుట సోమవారం రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. భాస్కర్‌రెడ్డి అనే యువకుడిపై ఈ నెల 10న రాత్రి గ్రామానికి చెందిన సంతోష్, సందీప్ దాడి చేశారని ఆరోపించారు. కానీ భాస్కర్‌రెడ్డి పైనే పోలీసులు కేసు నమోదు చేశారని వారు పేర్కొన్నారు. భాస్కర్‌రెడ్డిపై దాడిచేసిన వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని నినాదాలు చేసి అనంతరం ఎస్సై మురళికి వినతిపత్రం అందజేశారు. సిద్దారెడ్డి, రాంరెడ్డి, రాంచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ విషయమై ఎస్సైని వివరణ కోరగా భాస్కర్‌రెడ్డితో సంతోష్, అతడి సోదరుడు సందీప్ గొడవ పడ్డారన్నారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేశామన్నారు.

# పాలకవర్గ సమావేశాన్ని బహిష్కరించిన డైరెక్టర్లు



చైర్మన్, సీఈవోపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న డైరెక్టర్లు

పిట్లం : మండలంలోని చిన్నకొడప్‌గల్ సొసైటీ కార్యాలయంలో సోమవారం చైర్మన్ నారాయణరెడ్డి అధ్యక్షతన పాలకవర్గ సమావేశం నిర్వహించారు. తమకు తెలియకుండా ఎలా తీర్మానాలు చేస్తారని చైర్మన్, సీఈవోపై డైరెక్టర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో వారు సరైన సమాధానం చెప్పకుండా ఏమి చేస్తారో చేసుకొండి అనడంతో ఏడుగురు డైరెక్టర్లు సమావేశాన్ని బహిష్కరించారు. డైరెక్టర్లు కుమ్మరి సాయిలు, నాగిరెడ్డి, కాంత్‌రెడ్డి, లలిత, అనసూయ, అల్లాపూర్ సాయిలు మాట్లాడుతూ తమకు సమాచారం లేకుండానే పాత సొసైటీ భవనం కూల్చివేతకు రూ.22 వేలు ఖర్చు అయినట్లు తీర్మానం చేశారన్నారు. బోర్, మోటార్ కోసం రూ.89 వేలు ఖర్చు అయినట్లు రాశారని ఆరోపించారు. ఐదేళ్లుగా సంఘంకు వచ్చిన కమీషన్ వివరాలు ఇవ్వడం లేదన్నారు. కార్యాలయం షెటర్ మూసి లోపల సమావేశం నిర్వహించారు. దీంతో కార్యాలయానికి వచ్చిన రైతులు ఇబ్బందులు పడ్డారు.

# చిన్నమల్లారెడ్డిలో కాంగ్రెస్ ప్రచారం





చిన్నమల్లారెడ్డిలో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు, లక్ష్మీదేవునిపల్లిలో..

కామారెడ్డి రూరల్ : కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డిలో సోమవారం గడపగడపకు కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. మండల అధ్యక్షుడు గూడెం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే 6 గ్యారెంటీ స్కీములను అమలు చేస్తామన్నారు. నాయకులు ధర్మగోని రాజాగౌడ్, అన్నాల రమేష్ పాల్గొన్నారు.

**ఓటమి భయంతోనే తప్పుడు ప్రచారం**

భిక్కనూరు : కామారెడ్డిలో సీఎం కేసీఆర్ ఓటమి తప్పదని సర్వేలు చెబుతుండడంతో భయపడి బీఆర్ఎస్ నేతలు మాజీ మంత్రి షబ్బీర్‌అలీపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని లక్ష్మీదేవునిపల్లిలో గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. షబ్బీర్ అలీ మూడు సార్లు ఓటమి పాలయినా కామారెడ్డి ప్రజలకు అందుబాటులో ఉండి వారి కష్టసుఖాల్లో పాలుపంచుకున్నారన్నారు. కామారెడ్డిలో షబ్బీర్ అలీ గెలుపు తథ్యమని తేలడంతో బీఆర్ఎస్ నేతలు కామారెడ్డి నుంచి పోటీకి షబ్బీర్ అలీ వెనుకంజ వేస్తున్నాడని తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. బల్యాల సుదర్శన్, బీంరెడ్డి, లింబాద్రి, ఎన్ను శ్రీనివాస్‌రెడ్డి, లింగారెడ్డి, భూపాల్, నాగరాజు పాల్గొన్నారు.

**ఏడో వార్డులో..**

కామారెడ్డిటౌన్ : పట్టణంలోని ఏడో వార్డులో గడప గడప కాంగ్రెస్ ప్రచారాన్ని సోమవారం నిర్వహించారు. వార్డు ఇన్‌చార్జి రాణప్రతాప్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ఆరు గ్యారెంటీ స్కీములపై ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు హాజరై అసెంబ్లీ ఎన్నికల్లో షబ్బీర్ అలీని గెలిపించాలని కోరారు. పండ్ల రాజు, కారంగలు అశోక్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ఊరికి ఉత్తరాన వలలో..

సాక్షి, నెట్‌వర్క్ : జిల్లా వ్యాప్తంగా బతుకమ్మ వేడుకలు ఘనంగా కొనసాగుతున్నాయి. మహిళలు వివిధ రకాల పూలతో బతుకమ్మలను పేర్చారు. సాయంత్రం బతుకమ్మలను ఒక చోట పెట్టి ఉత్సాహంగా ఆడిపాడారు. అనంతరం చెరువుల్లో నిమజ్జనం చేశారు.



మద్నూర్‌లో బతుకమ్మను పేరుస్తున్న మహిళలు





కామారెడ్డిలోని ఆర్కే కళాశాలలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు, బీబీపేటలో మహిళలు



చిన్నమల్లారెడ్డిలో..



కామారెడ్డిలోని ధర్మశాలలో..



బాన్సువాడ మహిళా జూనియర్ కళాశాలలో..



బతుకమ్మను నిమజ్జనం చేస్తున్న మహిళలు

# బీఎల్‌వోలుగా జీపీ కార్యదర్శులు

**ఇప్పటికే పనిభారంతో సతమతం**



రామారెడ్డిలో జీపీ కార్యదర్శులకు అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్

రామారెడ్డి : పనిభారంతో ఇబ్బందులు పడుతున్న పంచాయతీ కార్యదర్శులకు ప్రభుత్వం బీఎల్‌వో బాధ్యతలు అప్పగించింది. కార్యదర్శులు పల్లె ప్రగతి పనులతో పాటు హరితహారం, పన్నుల వసూళ్లు తదితర పనులు చేపడుతున్నారు. గ్రామంలో ఏ చిన్న సమస్య తలెత్తిన అధికారిగా బాధ్యత వహించడం పంచాయతీ కార్యదర్శులకు కత్తి మీద సాములా తయారైంది. దీనికి తోడు బీఎల్‌వో బాధ్యతలు అప్పగించడంతో వారు ఆందోళన చెందుతున్నారు. బీఎల్వోలుగా గతంలో వీఆర్వో, వీఆర్‌ఏలు వ్యవహరించి ఓటర్ నమోదు, చనిపోయిన వారి ఓట్ల తొలగించడం, ఓటర్ స్లిప్పులను ఇంటింటికి పంపిణీ చేయడం చేసేవారు. ప్రస్తుతం వీఆర్వో, వీఆర్‌ఏ వ్యవస్థ రద్దు కావడంతో బీఎల్వో బాధ్యత కార్యదర్శులకు అప్పగించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడం, ఓటర్ నమోదు ప్రక్రియ చేపట్టడం మరింత భారంగా మారిందని కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ఆలయానికి రథం బహూకరణ



మాచారెడ్డి : మండలంలోని చుక్కాపూర్ లక్ష్మీ నరసింహస్వామి ప్రతిమలను ఊరేగించడానికి నిజామాబాద్ నగరానికి చెందిన బండారు విజయ్ కుమార్, నర్సింగరావు, శ్రీనివాస్ కుటుంబ సభ్యులు రథం తయారు బహూకరించారు. రూ.మూడు లక్షలతో రథం తయారు చేయించి ఆలయానికి అందజేశారు. దీంతో దాతలను ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు సన్మానించారు. సర్పంచ్ సౌజన్య, కృష్ణ మూర్తి, నరసింహారెడ్డి, శశిధర్‌రెడ్డి ఉన్నారు.

### బాధ్యతల స్వీకరణ



సదాశివనగర్ : మండల డిప్యూటీ తహసీల్దార్‌గా షరీఫ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు పని చేసిన సాయిలు బదిలీ కావడంతో ఆయన స్థానంలో షరీఫ్ బాధ్యతలు చేపట్టారు.

### పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి మండలం మత్తమాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం గర్భిణులు, బాలింతలకు డాక్టర్ శరత్ వైద్య పరీక్షలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు సక్రమంగా వైద్య పరీక్షలు చేయించుకొని ప్రభుత్వం నుంచి అందించే పౌష్టికాహారం తీసుకోవాలని అన్నారు. సిబ్బంది శారద, ఇందిర పాల్గొన్నారు.

### సబ్బండ వర్ణాల మేలు కోసం మేనిఫెస్టో



నిజాంసాగర్ : సీఎం కేసీఆర్ సబ్బండ వర్ణాల మేలు కోసం బీఆర్ఎస్ పార్టీ మేనిఫెస్టోను ప్రకటించారని నిజాంసాగర్ ఎంపీపీ పట్లోళ్ల జ్యోతి దుర్గారెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. ఎంపీటీసీలు సుజాత, బాలమణి, జనార్దన్, దేవదాస్, నాయకులు దుర్గారెడ్డి, గైని విఠల్, మనోహర్, రమేష్‌గౌడ్, నారాయణ, నర్సింహరెడ్డి, శ్రీనివాస్, నారాయణ, రమేష్ ఉన్నారు.

### రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి



కామారెడ్డి అర్బన్ : రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని చాకలి ఎస్సీ సాధన సమితి జిల్లా అధ్యక్షుడు సిహెచ్ రాజయ్య డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక కర్షక్ బీఎడ్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రజకులు ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందడానికి అన్ని పార్టీలు చేయుతనివ్వాలని కోరారు. కుపిర్యాల సంగయ్య, బుర్రి సంజీవులు, సంగయ్య, రమేష్ పాల్గొన్నారు.

### సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

ఎల్లారెడ్డి/సదాశివనగర్/తాడ్వాయి/లింగంపేట: ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే ఎమ్మెల్యే జాజాల సురేందర్ చిత్ర పటాలకు పాలాభిషేకం చేశారు. ప్రజలకు మేలు చేసే మేనిఫెస్టోను సీఎం ప్రకటించారన్నారు. లింగంపేటలో మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్ మాట్లాడుతూ.. కేసీఆర్ మూడో సారి ముఖ్యమంత్రి కావడం ఖాయమైందన్నారు. ఎమ్మెల్యే సురేందర్‌కు కేసీఆర్ బీ ఫాం అందించడంతో గెలుపు ఖాయమైందన్నారు. మెజార్టీ కోసం ప్రతీ కార్యకర్త కృషి చేయాలన్నారు. ఎల్లారెడ్డిలో మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ, సదాశివనగర్‌లో బద్దం శ్రీనివాస్ రెడ్డి, సాయిలు, తాడ్వాయిలో మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.





ఎల్లారెడ్డిలో క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, సదాశివనగర్‌లో..

### విస్తృతంగా తనిఖీలు..



బీబీపేట/రాజంపేట/పెద్దకొడప్‌గల్ : ఎన్నికల నేపథ్యంలో పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నారు. బీబీపేటలో ఎస్సై సాయిరెడ్డి ఆధ్వర్యంలో దాబాల్లో తనిఖీలు చేశారు. రాజంపేట మండలం పెద్దాయిపల్లి శివారులో ఎస్సై సంపత్ ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. పెద్దకొడప్‌గల్ మండలం అంజని చౌరస్తాలో ఏఎస్సై రాములు వాహనాలను తనిఖీ చేశారు.

## నియామకం



తాడ్వాయి : తాడ్వాయికి చెందిన మెట్టు చంద్రం కాంగ్రెస్ జిల్లా జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియామకం అయినట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు. మెట్టు చంద్రం మాట్లాడుతూ పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తానన్నారు. తనను జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించినందుకు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, మాజీ మంత్రి షబ్బీర్ అలీకి కృతజ్ఞతలు తెలిపారు.

## సంక్షిప్తం

**దసరా ఉత్సవాలపై నేడు సమావేశం**

భిక్కనూరు: మండల కేంద్రంలో దుర్గ నవరాత్రి, దసరా ఉత్సవాలను ఘనంగ నిర్వహించేందుకు మంగళవారం గ్రామపంచాయతీ ఆవరణలో సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ తున్కి వేణు తెలిపారు. దుర్గామాత మండపాల కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు హాజరు కావాలని కోరారు.

**22న పెద్ద బతుకమ్మ**

భిక్కనూరు: భిక్కనూరులో ఈ నెల 22న పెద్ద బతుకమ్మ (సద్దుల బతుకమ్మ) నిర్వహించనున్నట్లు సర్పంచ్ తున్కి వేణు సోమవారం తెలిపారు. వేద బ్రాహ్మణులు సిద్దగిరిశర్మ, శ్రీనివాస శర్మ అష్టమి 22న ఉన్నందున పెద్ద బతుకమ్మ అదే రోజు నిర్వహించాలని సూచించారని తెలిపారు. 23న దసరా నిర్వహిస్తామన్నారు.

**ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి**

తాడ్వాయి: ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్సై ఆంజనేయులు సూచించారు. తాడ్వాయిలోని పోలీసు స్టేషన్‌లో సోమవారం ఆటో డ్రైవర్లతో ఆయన సమావేశమయ్యారు. ఆటో యూనియన్ సభ్యులు రాజయ్య, శంకర్‌గౌడ్, కిషన్‌రావు, లింగం, కరీం, శ్రీకాంత్ పాల్గొన్నారు.

**కామారెడ్డి నుంచే షబ్బీర్ అలీ పోటీ**



లింగంపేట: మాజీ మంత్రి షబ్బీర్ అలీ కామారెడ్డి నుంచే పోటీ చేస్తారని కాంగ్రెస్ మైనారిటీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఫీయొద్దీన్ అన్నారు. సోమవారం ఆయన లింగంపేటలో పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. కామారెడ్డి నుంచి షబ్బీర్ అలీ బరిలో ఉండరనే మీడియా కథనాలను నమ్మవద్దన్నారు. బీఆర్ఎస్ నాయకులు కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజక వర్గాల ప్రజలను అయోమయానికి గురి చేయడానికి తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. నాయకులు జొన్నల రాజు, శివయ్య, గోవింద్, ఇర్ఫాన్, దశరథ్, నగేష్ పాల్గొన్నారు.